
ప్రజాశక్తి
గురువారం 6 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



పాచిపెంట కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి-పాచిపెంట

విధుల్లో నిర్లక్ష్యం వహించిన పాచిపెంట గ్రామ కార్యదర్శి గర్భాపు దీపక్‌ని కలెక్టర్ ప్రభాకరరెడ్డి సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ బివిజె పాత్రో తెలిపారు. ఇంట పన్నుల వసూళ్ల వివరాలు ఆన్‌లైన్ చేయడంలో అలసత్వం వహించడమే ప్రధాన కారణం. పాచిపెంట గ్రామంలో 2100 ఇళ్లు ఉన్నాయి. ఇంటి పన్నుల వసూళ్ల సమయంలో పన్ను రశీదుకు ఇంటి యజమాని ఫోన్ నంబర్ అనుసంధానం చేయాలి. అలాకాకుండా 1200 ఇంటి పన్ను రశీదులకు ఇంటి యజమాని ఫోన్ నంబర్ కాకుండా ఇతరులకు సంబంధించిన ఒకే నంబర్ అనుసంధానం చేయడంతో కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ వివరించారు.

రగులుతున్న పునర్విభజన చిచ్చు

- శ్రీకాకుళం జిల్లాలో కలపాలంటున్న పాలకొండ వాసులు
- పాత జిల్లాలోనే విలీనం చేయాలంటున్న మెంటాడ నాయకులు
- మన్యం జిల్లా కూర్పులో మార్పులుంటాయా?
- ఎటూ తేల్చని సబ్ కమిటీ
- 10న కేబినెట్ మీటింగ్‌లో తేలనున్న జిల్లాల పునర్విభజన



విజయనగరం జిల్లాలోనే కొనసాగించాలని కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మెంటాడ వాసులు (ఫైల్)

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన, మార్పులు, చేర్పులు, కొత్త జిల్లాల ఏర్పాటు గత కొద్ది నెలలుగా చర్చనీయాంశమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని టిడిపి ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా ఆరుగురు మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసి జిల్లాల రూపురేఖల మార్పులు, చేర్పులు, కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఆదేశించింది. ఆగస్టు నెలాఖరులోగా ఈ కమిటీ సభ్యులు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో తిరిగి అభిప్రాయ సేకరణ చేపట్టాలని ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. అయితే అలా జరగలేదు. ఆగస్టులోగా మంత్రుల సబ్‌కమిటీ జిల్లాల్లో పర్యటించలేదు. సెప్టెంబరు, అక్టోబర్ నెలలు కూడా దాటిపోయాయి. అయినా జిల్లాల పునర్విభజనపై ప్రభుత్వ నిర్ణయం కొలిక్కి రాలేదు. అయితే కొద్ది నెలల క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశాల్లో ఈ అంశంపై చర్చలు జరిగాయి. నేరుగా మంత్రుల సబ్ కమిటీ సభ్యులు జిల్లాల్లో పర్యటించక పోయినా ఆన్‌లైన్‌లో ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను కొంతవరకు ప్రభుత్వం తీసుకుంది. జిల్లాల పునర్విభజన, మార్పులు, చేర్పులు, కొత్త జిల్లాల ఏర్పాటు వంటి అంశాల వల్ల భవిష్యత్తులో టిడిపి కూటమికి కలిగే రాజకీయ ప్రయోజనాల గురించి బేరీజు వేసుకుంటూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇంతవరకు పార్వతీపురం మన్యం జిల్లా రూపురేఖల మార్పులు, చేర్పుల విషయంలో ఏ విధమైన స్పష్టత కనిపించడం లేదు. కానీ రకరకాల ఊహాగానాలు వస్తున్నాయి.

శ్రీకాకుళంలో కలపాలంటున్న పాలకొండ వాసులు

గతంలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పాలకొండ నియోజకవర్గాన్ని గత ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పడిన మన్యంలో విలీనం చేశారు. విజయనగరం జిల్లాలో ఉన్న సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాలతో పాలకొండను కలిపి మన్యం జిల్లాగా ఏర్పాటు చేశారు. జిల్లాల పునర్విభజన అంశం తెరపైకి రావడంతో పాలకొండ నియోజకవర్గ నాయకులు సరికొత్త గళం వినిపిస్తున్నారు. నియోజకవర్గంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు జిల్లా సాధన కమిటీగా ఏర్పడి పోరాటానికి శ్రీకారం చుట్టారు. కొద్దిరోజుల క్రితం పాలకొండలో ఈ కమిటీ సభ్యులు రిలే దీక్షలు చేపట్టారు. పాలకొండ నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలో కలపాలని లేదా కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలనే నినాదంతో వారు పోరుబాట పట్టారు. ఈ ప్రాంత ప్రజలకు శ్రీకాకుళం జిల్లాతోనే ఎక్కువగా సత్సంబంధాలు నెలకొన్నాయని, అందుకే పాత జిల్లాలోనే విలీనం చేయాలని, లేదంటే పాలకొండనే జిల్లా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాలకొండ నియోజకవర్గాన్ని శ్రీకాకుళం జిల్లాలో కలిపితే విజయనగరం జిల్లాలోని బొబ్బిలి నియోజకవర్గాన్ని పార్వతీపురం జిల్లాలో కలుపుతారనే ప్రచారం జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న మన్యం పేరు తొలగించి బొబ్బిలి నియోజకవర్గంతో కలిపి పార్వతీపురం జిల్లాగా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. భౌగోళికంగా బొబ్బిలి నియోజకవర్గం పార్వతీపురం జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉండడం, సామాజిక, రాజకీయ కోణాల్లో సంబంధాలు కలిగి ఉండటంతో విజయనగరం జిల్లా నుంచి విడదీయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇప్పటికే బొబ్బిలి బార్ అసోసియేషన్ నాయకులు, కొన్ని ప్రజాసంఘాల నాయకులు కూడా ప్రభుత్వానికి దరఖాస్తులు పంపారు.

మెంటాడపై సందిగ్ధత

మన్యం జిల్లాలోని సాలూరు గిరిజన నియోజకవర్గ పరిధిలో మెంటాడ మండలం భౌగోళికంగా ఉంది. గతంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా గజపతినగరం నియోజకవర్గంలో ఉన్న మెంటాడ మండలాన్ని సాలూరు నియోజకవర్గంలో విలీనం చేశారు. మెంటాడ మండలం భౌగోళికంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని వల్ల తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటామని భావించిన మండల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు.. తాజాగా పోరుబాట పట్టారు. సాలూరు నియోజకవర్గంలో ఉన్న ఈ మండలాన్ని విజయనగరం జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ సమితి ఏర్పడి గత ప్రభుత్వంలోని జిల్లా పెద్దలను కలిసి డిమాండ్‌ను వినిపించారు. మెంటాడ మండల నాయకులు, ప్రజలు ఐక్యంగా కోరడంతో అప్పటి జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే రాజన్నదొర విజయనగరం జిల్లాలో విలీనానికి అంగీకరించారు. ఆ వెంటనే అప్పటి ప్రభుత్వం మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా మెంటాడ మండలం కథ మొదటికొచ్చింది. ఇటీవల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ మెంటాడ మండలం మన్యం జిల్లాలోనే ఉంటుందని ప్రకటించారు. దీంతో ఆ మండల ప్రజలు, నాయకుల్లో అలజడి మొదలైంది. ఒక నియోజకవర్గంలో ఉన్న మండలాలను విడదీసేది లేదంటూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటన జారీ చేశారు. ఈ ప్రకటన నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మెంటాడ మండలంపై మెలిక పెట్టారు. ఈ నేపథ్యంలో మెంటాడ మండల నాయకులు మరోసారి రాజకీయాలకు అతీతంగా పోరుబాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

కేంద్రమంత్రిని కలిసిన సాధన సమితి

పాలకొండ : శ్రీకాకుళం మండల పరిధిలో కల్లేపల్లిలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును పాలకొండ జిల్లా సాధన సమితి బృందం.. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో బుధవారం కలిసింది. పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని వినతిపత్రం అందించారు. జిల్లాల పునర్విభజన తర్వాత పాలకొండకు అన్యాయం జరిగిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తనవంతు ప్రయత్నిస్తానని రామ్మోహన్ హామీఇచ్చారు. కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షులు కనపాక చౌదరి నాయుడు, అధ్యక్షులు బి.అప్పలనాయుడు, సబ్బ నానాజీ, తుమ్మగుంట శంకర్రావు, రామకృష్ణ, సత్యనారాయణ, గుమ్మడి సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర

గిరిజనుల ప్రాణాలంటే అంత చిన్నచూపా?

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి- పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సురేంద్ర విమర్శించారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లాలో మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9లోగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 10న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట సంఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.15 లక్షలు ఎలా మంజూరు చేసిందని ప్రశ్నించారు. జిల్లాలో 11 మంది గిరిజన విద్యార్థులు మరణించినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదన్నారు. గిరిజనుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని దుయ్యబట్టారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజనులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.రామస్వామి, కె.సీతారాం, వాసు, రామారావు, బలరాం పాల్గొన్నారు.

జీడి పునరుద్ధరణకు చర్యలేవీ?

ప్రజాశక్తి కొమరాడ

మండలంలో ఏజెన్సీ ప్రాంతంలో జీడి పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కొమరాడలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐటిడిఎ పరిధిలో 8 మండలాల్లో జీడి పిక్క బతుకు పక్క అనే నినాదంతో గిరిజన రైతులకు సుమారు 65 వేల ఎకరాల్లో జీడి పంట పండించే పరిస్థితి ఉందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో జీడి పునరుద్ధరణ అంటే జీడి మొక్కలను కత్తిరించే పథకం అమలు చేయాల్సి ఉందన్నారు. ఐటిడిఎ అధికారులు గతేడాది కేవలం ఐటిడిఎ పరిధిలో 1500 ఎకరాలకు మాత్రమే జీడి పునరుద్ధరణ ప్రారంభించారని చెప్పారు. ఒక్కొక్క ఎకరాకి రూ.3 వేలు, సామగ్రి ఇవ్వాల్సి ఉందని, ఇందులో కొంతమంది రైతులకు ఇచ్చారు తప్ప పూర్తి స్థాయిలో కూడా అమలు చేయలేదని చెప్పారు. ఉద్యాన శాఖ అధికారులు జీడి రైతులకు ఉచిత సలహాలు తప్ప వారికి పూర్తిస్థాయిలో ఆదుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు హెచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

మన్యంలో ఆగని డోలిమోతలు

ప్రజాశక్తి-కొమరాడ

మన్యం జిల్లాలో డోలిమోతలు ఆగడం లేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పిస్తామని ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు చెప్పే హామీలు నీటిపై రాతలుగానే మిగిలిపోతున్నాయి. అంతేతప్ప గిరిజన ప్రాంతాలకు రహదారి సౌకర్యం మాత్రం కల్పించడం లేదు. తాజాగా కొమరాడ మండలంలో మంగళవారం జరిగిన డోలిమోత సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో కొమరాడ మండలం కుంతేసు పంచాయతీ జొప్పంగి గ్రామానికి చెందిన హిమరక సావిత్రికి పురిటి నొప్పులు పెరిగాయి. దీంతో కుటుంబ సభ్యులు డోలిలో జొప్పంగి నుంచి 5 కిలోమీటర్ల కిందనున్న మసిమండకు తీసుకొచ్చారు. అక్కడ నుండి ఆటోలో రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా, ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఇటువంటి పరిస్థితులు ఇంకెన్నాళ్లు? అంటూ స్థానిక ఆదివాసీలు వాపోతున్నారు.



డోలిలో సావిత్రిని తీసుకొస్తున్న గిరిజనులు

సిఆర్ఎం బృందం పర్యటన

ప్రజాశక్తి-పాలకొండ, కురుపాం, వీరఘట్టం

జిల్లాలో సెంట్రల్ రివ్యూ మిషన్ బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా పాలకొండ, కురుపాం ఏరియా ఆస్పత్రులను, వీరఘట్టం, బత్తిలి పిహెచ్‌సిలను తనిఖీ చేసింది. ఆస్పత్రుల్లో అన్ని విభాగాలను బృందం సభ్యులు పరిశీలించి, వివరాలు ఆరాతీశారు. ఎంతమంది వైద్యులు ఉన్నారు, ఎలాంటి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి, రోజుకు ఎంత ఒపి నమోదు అవుతుంది? తదితర వివరాలు సేకరించారు. కురుపాంలో అనంతరం నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాలను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు భవానీప్రసాద్, సభ్యులు దీపిక శర్మ, రమణ, నీరజ్ కుమార్, వైద్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు అనిల్ కుమార్, డిఎంహెచ్ఒ ఎస్ భాస్కరరావు, డిసిహెచ్ఎస్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



కురుపాం ఏరియా ఆస్పత్రిలో రికార్డులు తనిఖీలు చేస్తున్న కేంద్ర బృందం

అన్నదాత అగచాట్లపై చర్చించేనా?

- కునారిల్లుతున్న వసతి గృహాలు
- సుఖీభవ, తల్లికి వందనం, పింఛన్ల కోసం ఇప్పటికీ ఎదురుచూపులే
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఎటువైపు చూసినా అన్నదాత అగచాట్లే కనిపిస్తున్నాయి. ఓవైపు అధిక వర్షాలతో తగ్గిన మొక్కజొన్న, పత్తి దిగుబడి... ఇప్పటికీ ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు, మరోవైపు వరి రైతులను ముంచేసిన మొంథా తుపాను... ఉచిత పంటల బీమా ఎత్తివేతతో రైతులకు కొరవడ్డ బీమా. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందకపోవడం ఇలా ఒకటా రెండా... ఎటు చూసినా రైతులకు కష్టనష్టాలే కనిపిస్తున్నాయి. మొదట్లో యూరియా కొరతతతో ఇబ్బందులు ఎదుర్కోగా, ఇప్పుడు ఇతర ఇబ్బందులన్నీ తోడయ్యాయి. మరోవైపు గిరిజన, సాంఘిక, బిసి సంక్షేమ హస్టళ్లు పుట్టెడు అసౌకర్యాలతో కునారిల్లుతున్నాయి. ముఖ్యంగా గిరిజన వసతి గృహాల్లో ముక్కుపచ్చలారని చిన్నారులు ఇటీవల కాలంలో మృత్యువాత పడ్డారు. ఇప్పటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, సామాజిక పింఛన్లు పూర్తిస్థాయిలో అంద లేదు. ఇలా చెప్పకుంటూ పోతే ఎన్నో సమస్యలు జిల్లా వాసులను వెంటాడున్నాయి. వీటిన్నింటిపైనా నేడు (గురువారం) జరగబోయే జిల్లా పరిషత్ సమావేశంలో చర్చ జరిగేనా? అన్న ఆశ, సందేహాలు వ్యక్తమౌతున్నాయి.



ఉమ్మడి జిల్లాలో ముందుకొస్తున్న సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ, సేవాకార్యక్రమాల్లో లోటుపాట్లపై రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించాలనే సంకల్పాన్ని ప్రతి జెడ్‌పి సమావేశంలోనూ చర్చిస్తునే ఉన్నారు. కానీ, ఇప్పటి వరకు అటువంటి ప్రయత్నం చేయలేదు. దీంతో, అజెండాలో పేరొన్న అంశాల్లో మూడో వంతు అజెండాతో మమా అనిపిస్తున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే... ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ అధిక వర్షాలు కురవడంతో మొక్కజొన్న, పత్తిపంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. వచ్చిన అరకొర దిగుబడులను ఎండబెట్టుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో నాణ్యత కాస్త తగ్గింది. దీనికితోడు ఈ రెండు పంటల కొనుగోళ్లకు అధికార యంత్రాంగం ప్రకటన తప్ప, ఆచరణలో ఏర్పాటు చేయలేదు. దీన్ని అసరాగా చేసుకుంటున్న వ్యాపారులు, దళారులు నచ్చిన ధరకు కొనుగోలు చేసుకుంటున్నారు. మరోవైపు ఈ ఏడాది పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వం భరించకపోవడంతో గతంలో లక్షలాదిగా ఇన్సూరెన్స్ పొందిన రైతులు ఈసారి వేల సంఖ్యకు తగ్గారు. యూరియా కొరత, ఎరువులు, పురుగుల మందుల ధరల పెంపు వంటి కారణాలతో వ్యవసాయ పెట్టుబడులు రైతులకు తలకు మించిన భారంగా మారాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా వేలాది ఎకరాల్లో వరి పంట కూడా నీట మునిగిపోయింది. ఈ నేపథ్యంలో పంటలన్నీ ప్రభుత్వం కొనుగోలు చేయడంతోపాటు ఉదారంగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇంకోవైపు తొలి నుంచీ అస్తవ్యస్తంగావున్న రోడ్లు ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా మరింత అధ్వానంగా మారాయి. వీటిపై జిల్లాలో ఒక నిర్దిష్టమైన కార్యాచరణ లేకపోతే ప్రమాదాలు మరింతగా పెరిగే అవకాశాలు లేకపోలేదు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గిరిజన, సాంఘిక, బిసి వెల్ఫేర్ హస్టళ్లల్లో సమస్యలు పేరుకుపోయాయి. భవనాలు పెచ్చులు ఊడాపోవడం, బీటలువారడం వంటి ప్రమాదకర స్థితిలోవున్నాయి. ఆర్ఒ ప్లాంట్లు పనిచేయక తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మోనా ఛార్జీలు సరిపోవడం లేదు. పౌష్టికాహారలోపంతో విద్యార్థులు తంచూ అనారోగ్యాలకు గురౌతున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని సకాలంలో గుర్తించేందుకు వసతి గృహాల్లో ఎఎన్ఎంలు కూడా లేకపోవడం మరణ శాసనంగా మారుతోంది. ఇటీవల కురుపాం గిరిజన వసతి గృహంలో ఇద్దరు, సీతంపేటలో ఒకరు, సాలూరులో ఒకరు, మక్కువ మండలంలో ఒకరు మరణించడం ఇందుకు మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. ఇక అన్నదాత సుఖీభవ పథకం జిల్లాలో చాలా మంది రైతులకు వర్తించలేదు. ముఖ్యంగా ఇనాం, దేవాదాయ శాఖ, పెద్ద రైతుల వద్ద కౌలుకు సాగుచేస్తున్న రైతులు ఈ పథకానికి నోచుకోలేదు. తల్లికివందనం కోసం ఇప్పటికీ చాలా మంది అర్హులు ఎదురు చూస్తునే ఉన్నారు. పింఛను పొందుతున్న భర్త చనిపోతే, అదే పింఛను భార్యకు వర్తింపజేయడం తప్ప కొత్తగా పింఛన్లు ఇవ్వడం లేదు. దీంతో, జిల్లాలో వందలాది మంది వితంతువులు, వికలాంగులు, వృద్ధులు పింఛన్ల కోసం ఎదురుస్తున్నారు. ఈనేపథ్యంలో వీటన్నింటిపైనా జిల్లా పరిషత్ సమావేశంలో చర్చజరుగుతుందా? లేదా? అన్నదానిపై జనం సర్వత్రా చర్చించుకుంటున్నారు.

సంక్షేమానికి కష్టాలు

నీటి కోసం నానా పాట్లు ● బిసి వసతిగృహంలో విద్యార్థులకు అవస్థలు

ప్రజాశక్తి-పాలకొండ

సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టించుకోవాల్సిన అధికారులు, పాలకులు దృష్టి పెట్టడం లేదు. ఎన్నో ఏళ్ల నుంచి సమస్య కొనసాగుతున్నా ఏ ఒక్కరూ పరిష్కరించే దాఖలాలు లేవు. చివరికి విద్యార్థులు ఆ వసతి గృహానికి చేరాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. ఇది ఎక్కడో కాదు.. పాలకొండ పట్టణంలో గారంకాలనీ బిసి బాలుర వసతిగృహంలో ఎదురవుతున్న సమస్య.

పాలకొండ పట్టణంలోని గారంకాలనీలో బిసి బాలుర వసతిగృహాన్ని రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటుచేశారు. దాదాపు పదేళ్లుగా ఇక్కడి వసతిగృహాన్ని నీటి సమస్య వెంటాడుతోంది.



గారంకాలనీలోని బిసి బాలుర వసతిగృహం

అయినప్పటికీ ఏ ఒక్కరూ పరిష్కరించడం లేదు. విద్యార్థులు తాగడానికి నీరు లేకపోవడం, కనీసం కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా నీరు కరువైన పరిస్థితి కనిపిస్తోంది. గత ఏడాది 60 మంది విద్యార్థులు వసతి గృహంలో చేరగా, నీటి సమస్య వల్ల 16 మంది మిగిలారు. వసతిగృహంలో మరుగుదొడ్లు ఉన్నా అవి నిరుప యోగంగానే మిగిలాయి. దానికి నీటి సదుపాయం లేకపోవడమే అందుకు కారణం. బోరు ద్వారా ఒక చుక్క కూడా నీరు రాకపోవడంతో విద్యార్థులు మలమూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చివరికి స్నానాలకు కూడా నీరు లేకపోవడంతో చెరువులకు వెళ్తున్నారు. చెరువులకు వెళ్తే ప్రమాదమని తెలిసినా విద్యార్థులు తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తోంది.

తాగడానికి నీరు కరువే

వసతిగృహంలో బోరు ద్వారా నీరురావడం లేదు. కనీస అవసరాలతోపాటు విద్యార్థులు తాగడానికి కూడా నీటి కరువు ఏర్పడింది. చివరికి విద్యార్థులు నీరు బయట నుంచి కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి దాపురించింది. చేసేదేమీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహంలో నీటి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

నీటి సమస్య పరిష్కరించాలి

గారంకాలనీలోని బిసి బాలుర వసతిగృహంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. పాలకులు, అదికారులు వెంటనే దృష్టిపెట్టాలి. ఎన్నో ఏళ్ల నుంచి ఇక్కడ నీటి సమస్య వెంటాడుతున్నా ఎవరూ పట్టించుకోక పోవడం విచారకరం. సంక్షేమ వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

మొహం కడుక్కో.. సాఫీగా సాగిపో..

ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖ వినూత్న ఆలోచన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎస్‌పి మాధవరెడ్డి ఆదేశాలతో 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం చేపట్టారు. రహదారులపై ప్రమాదాలు జరగకుండా ఆర్‌టిసి, ప్రయివేటు బస్సులు, లారీలు, వ్యాన్లు, ఇతర వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాటాక వాహనాలను నిలిపి, డ్రైవర్లకు నీళ్లతో మొహం కడిగించి పంపించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపరాదని, నిర్దిష్ట వేగంతో గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవాలని పోలీసు అధికారులు సూచించారు.



నీటితో మొహం కడుక్కొంటున్న డ్రైవర్

మరింత మెరుగ్గా ఆరోగ్య సేవలు

విద్యార్థి దశలోనే వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన : కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి.. సిఆర్ఎం (సెంట్రల్ రివ్యూ మిషన్) బృందానికి తెలిపారు. పాఠశాల విద్యార్థి దశలోనే వ్యక్తిగత పరిశుభ్రత పట్ల పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును, వాటి ప్రగతిని పరిశీలించి సమీక్షించేందుకు సిఆర్ఎం బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఆరోగ్య బృందాలతో పాటు సమన్వయ శాఖాధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యక్తిగత పరిశుభ్రత లోపం కారణంగా ఎక్కువగా అనారోగ్యానికి గురవుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీనికి విద్యార్థి దశలోనే వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవసరమని గ్రహించి జిల్లాలోని ప్రతి అంగన్వాడీ, పాఠశాల, కళాశాలల్లోని విద్యార్థులకు ముస్తాబు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. తద్వారా ప్రతీ తరగతి గదికి ఇద్దరు లీడర్లను ఏర్పాటు చేసుకొని ప్రతి విద్యార్థి పరిశుభ్రంగా ఉన్నారా, లేదా అని పరిశీలించి తరగతి గదిలోకి పంపించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్న భోజనం ముందు, తదుపరి, మరుగుదొడ్లు వినియోగించిన తరువాత చేతులు పరిశుభ్రం చేసుకున్నదీ, లేనిదీ పరిశీలిస్తారని చెప్పారు. దీనివల్ల ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతకు అలవాటు పడతారని, వారి ఇంటి వద్ద కూడా తల్లిదండ్రులకు అలవాటుగా మారుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉన్నందున పరిసరాల పరిశుభ్రత లోపం కారణంగా మలేరియా జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశముందని గుర్తించినట్లు తెలిపారు. మలేరియా కేసు నమోదైన గ్రామంలో మా ఊరికి మలేరియా వచ్చింది అనే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. తద్వారా ఆ గ్రామంలో అందరూ జాగ్రత్తలు పాటించాలని దండోరా వేయించి ఇంటింటికి వెళ్లి మలేరియా నివారణ చర్యలను తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. తద్వారా జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని వివరించారు. వీటితో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతీ శుక్రవారం జిల్లాలో పక్కాగా అమలుచేస్తున్నట్లు కలెక్టర్ బృందానికి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా దోమలను పూర్తిగా నివారించేందుకు చేపట్టవలసిన అంశాలతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు.

కొమరాడ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య సంరక్షణ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించినట్లు సిఆర్ఎం బృందం కలెక్టర్‌కు వివరించింది. ఈ సందర్శన ద్వారా ఆయా కేంద్రాల పనితీరును, సేవలను అందించే విధానాన్ని పర్యవేక్షించినట్లు చెప్పారు. ముఖ్యంగా సామూహిక ముఖాముఖితో పాటు స్థానికులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆరోగ్య సేవలు, జాతీయ కార్యక్రమాల లబ్ధి గురించి అభిప్రాయాలను సేకరించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు చెప్పారు. మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి తగిన సూచనలు, సలహాలు అందించినట్లు చెప్పారు.

సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అదనపు సంచాలకులుతో కూడిన రాష్ట్ర స్థాయి బృందం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కర రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి జి.నాగభూషణ రావు, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, రెడ్ క్రాస్ సంస్థ, స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

వాహనమిత్ర రూ.25 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-బలిజిపేట

ఆటో, మోటారు కార్మికులకు వాహనమిత్ర 25 వేల రూపాయలు ఇవ్వి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు, ఆటో యూనియన్ నాయకులు హరి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బలిజిపేటలో బలిజిపేట, అరసాడ, నారాయణపురం, వంతరం, నూకలవాడ, పెదపెంకి, తుమరాడ ఆటో స్టాండ్లకు చెందిన ఆటో కార్మికుల సమావేశాన్ని ఆ సంఘం అధ్యక్షులు మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకాన్ని తీసుకొచ్చి ఆటో కార్మికుల బతుకును కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని వాపోయారు. 70 శాతం మందికి ఉపాధి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక పథకం ప్రవేశపెట్టినపుడు దాని ప్రభావం వల్ల ఎంతమందికి నష్టం జరుగుతుందో కూడా పరిశీలించి శాస్త్రీయంగా నష్ట పరిహారాన్ని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తిరుపతిరావు, గంగారావు, వెంకటేష్, రమేష్, శివ రాము, నారాయణ, సత్యనారాయణ, వై.శ్రీను, శంకర్రావు, నాయుడు పాల్గొన్నారు.

కాంట్రాక్టరే అధికారి

ప్రజాశక్తి-వీరఘట్టం

అధికారుల పర్యవేక్షణలో నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా ఎక్కడా జరగడం లేదు. దీనికి నిదర్శనం.. మండలంలోని వండవ సచివాలయ పరిధిలోని శృంగారాయపురంలో చేపడుతున్న పనులే. పంచాయతీ నిధులతో చేపడుతున్న కాలువ పనులను కాంట్రాక్టరు పర్యవేక్షణలోనే చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పది కాలాలు ఉండాల్సిన కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం వల్ల ముచ్చటగా మూడు రోజులకే ముగుస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆశయాలకు గండి కొట్టకుండా పనుల జరిగే చోట పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని ఆర్.వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్ వెంకటరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థుల కోసం ప్రభుత్వం చేసే మంచి పౌష్టిక ఆహారాన్ని అందించేలా చూడాలని కోరారు. విద్యార్థులకు మరుగుదొడ్ల తలుపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వాటికి మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరుపట్టీలను పరిశీలించారు. అనంతరం అంటిపేట సచివాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-బలిజిపేట

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్ కోరారు. బుధవారం సంబంధిత శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉండి రైతులకు సహాయం చేయాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ఎఒ శివ గణేష్ మాట్లాడుతూ ఈనెల పదో తేదీ నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీవాణి, హెచ్‌డిటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు

ప్రజాశక్తి-పాలకొండ

వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్‌మీటర్లు బిగించవద్దని సిపిఎం నాయకులు దావాల రమణారావు స్పష్టంచేశారు. స్థానిక పోస్టాఫీసు రోడ్డులో కేటగిరి-2 ఉన్న వారికి స్మార్ట్‌మీటర్లు వేయడానికి బుధవారం విద్యుత్ సిబ్బంది ప్రయత్నించారు. దీనిని సిపిఎం నాయకులు రమణారావు అడ్డుకున్నారు. స్మార్ట్ మీటర్ వేయాల్సిందేనని వినియోగదారులపై ఒత్తిడి తేవడం సరికాదని చెప్పారు. ఈ విధానం తక్షణమే మానుకోవాలని, వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు వెయ్యొద్దని చెప్పారు.

గ్రామీణ జీవనంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-భామిని

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పరివర్తన్, వాసన్ ఎన్‌జిఒ ఆధ్వర్యంలో గ్రామీణ జీవన స్థితిగతులు, జీవనోపాధి, ఆహారపు అలవాట్లు, పంటలు మార్పులు.. అనే అంశంపై గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులకు బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. గ్రామీణ సమాజంలో స్థిరమైన జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం, పంటలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై బృంద చర్చలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.రవీంద్ర, సంస్థ అసోసియేట్ డైరెక్టర్ మాకవరపు సన్యాసిరావు, వెలుగు లైవ్లీ హుడ్ డిపిఎం ధనలక్ష్మి, స్టేట్ కో ఆర్డినేటర్ వెంకట్ జయప్రకాశ్, ప్రోగ్రాం ఆఫీసర్ కళ్యాణ్ పాత్రో, కూన మనోజ్ కుమార్, వెలుగు ఎపిఎం మీసాల. చక్రపాణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మొండెంఖల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి అండర్-14కు 8వ తరగతి విద్యార్థి బిడ్డిక జాహ్నవిక, అండర్-17 కు పదో తరగతి విద్యార్థులు శీల పార్దు, వడ్డి ఇక్షిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.ముత్యాలు తెలిపారు. వీరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పిఇటి బి. మాధవరావు అభినందించారు.

కొమరాడ : ఎస్‌జిఎఫ్ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు కొమరాడ కొమరాడ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి వి.చరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో చరణ్‌ని అభినందించారు.

సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన

ప్రజాశ గుమ్మలక్ష్మీపురం

బిర్సాముండా 150వ జయంతి పురస్కరించుకొని గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం కాలనీలో జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు.

అప్పయ్యపేటలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అప్పయ్యపేట గ్రామంలో సబ్బాను శ్రీనివాసరావు పొలంలో బుధవారం పంట ప్రయోగాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి అవినాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగుబడి శాస్త్రీయంగా అంచనా వేయడానికి ఇది ఒక పద్ధతిని చెప్పారు. పంటల ఉత్పత్తి అంచనాలు, కరువు మండలాలు ఉంటే ఈ ప్రయోగాల ద్వారా గుర్తించవచ్చున్నారు. కార్యక్రమంలో గణాంక శాఖ అధికారి సతీష్, వ్యవసాయ సహాయక సిబ్బంది వినయ్ శర్మ, పి.లక్ష్మణ పాల్గొన్నారు.

సహజ పద్ధతులతో నేల సంరక్షణ

ప్రజాశక్తి-సీతంపేట

సహజ వ్యవసాయ పద్ధతి అవలంబించడం ద్వారా నేల సంరక్షణతోపాటు ఆరోగ్యకర ఆహారం అభివృద్ధి చెందుతుందని నాబార్డ్ జనరల్ మేనేజర్ పహాడ్ సింగ్ తెలిపారు. ఐఎఫ్ఎడి, ఎఐసి అధికారులు మండలంలో బూర్జగూడ , గుజ్జీ, దుగ్గి, చిన్న పొల్ల, జయపురం గూడ, గడిగుజ్జి గ్రామాల్లో పర్యటించారు. ఈ ప్రాంతంలో అమలవుతున్న వ్యవసాయ పద్ధతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల గురించి ఆర్ఫ్ డైరెక్టర్ సన్యాసిరావు వారికి వివరించారు.

అంతర్జాతీయ మహిళా రైతు దినోత్సవం ఆర్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెద్దపేటలో ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి డైరెక్టర్ సన్యాసిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ దంపతులు హాజరయ్యారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి. జనసేన మండల అధ్యక్షులు మాండంగి విశ్వనాథం, టిడిపి మండల అధ్యక్షులు ఎస్.ముఖలింగం, కూటమి నాయకులు హెచ్ పవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్

ఆశ్రమ విద్యార్థులకు వసతులు

ప్రజాశక్తి-కొమరాడ

ఎండభద్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. ఆదివారం ప్రజాశక్తి దినపత్రికలో గురుకులాల్లో సమస్యల తిష్ట అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఎంపిడిఒ స్పందించి, గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రస్తుతం బోరు సదుపాయం లేకపోవడంతో గెడ్డ నుంచి నీటిని మోటార్ సహాయంతో తీసుకొని తాగడం వాస్తవమేనని ఆయన తెలిపారు. విద్యార్థులకు గడ్డి నుంచి మోటార్ సాయంతో వస్తున్న నీటిని వేడి చేసి ఇస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఆశ్రమ పాఠశాల వద్ద మంచినీటి బోరును ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భోజనశాలకు కర్టెన్లు ఏర్పాటుచేయాలని హెచ్‌ఎంకు సూచించారు. తరగతి గదులకు మరమ్మతులకు అంచనా తయారు చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భూపతి నాయుడు, వార్డెన్ రాజారావు తదితరులు ఉన్నారు.

'ప్రజాశక్తి' కథనానికి స్పందన


మరుగుదొడ్లకు కర్టెన్లు ఏర్పాటు చేయిస్తున్న వార్డెన్ పోలినాయుడు

మరుగుదొడ్లకు కర్టెన్లు ఏర్పాటు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమ పాఠశాలలో తలుపులు లేని మరుగుదొడ్లకు తాత్కాలికంగా కర్టెన్లను ఏర్పాటు చేశారు. హాస్టల్లో విద్యార్థులు ఉండే గదులలో విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరిచారు. బుధవారం ప్రజాశక్తిలో వెలువడిన 'పేరుకే మరుగు.. తలుపులు కనుమరుగు' అనే కథనానికి వార్డెన్ పోలినాయుడు స్పందించారు. హాస్టల్ బయట ప్రదేశంలో కూడా విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. బుధవారం జెసిబితో హాస్టల్ పరిసరాలను శుభ్రం చేశారు. త్వరలో హాస్టల్లో నెలకొన్న మరికొన్ని సమస్యలకు పరిష్కారం లభించే ఆస్కారం ఉందని వార్డెన్ పోలినాయడు తెలిపారు.

నీటి ప్రవాహాల వద్ద జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-కొమరాడ

వనభోజనాల సమయంలో నీటి ప్రవాహాల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పార్వతీపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రంగనాథం అన్నారు. గురువారం కొమరాడ పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నదీ పరవాక ప్రాంతాల్లో వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉంటూ వనభోజన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో పిల్లలతో నదిలో దిగి స్నానాలు చేయవద్దని చెప్పారు. ఆలయాలకు భక్తులు తాకిడి అధికంగా ఉంటుందని, క్యూలైన్లో తొందర పడకుండా దర్శనాలు చేసుకోవాలని సూచించారు. కార్తీక సోమవారాల సందర్భంగా పలు ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో భూతగాదాలు నిత్యం పెరగడంతో ఎస్‌పి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు న్యాయమైన సేవలు అందించేందుకు పోలీసు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గంజాయి, నాటు సారా, అక్రమ మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సమావేశంలో కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైద్యానికి నిధులు కేటాయించండి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-సీతానగరం

వైద్య రంగానికి నిధులు కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం సిఆర్ఎం బృందానికి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు మాట్లాడుతూ వైద్య రంగానికి అధిక నిధులు కేటాయించి పేదలకు వైద్యమందించే విధంగా చర్యలు ఉండాలన్నారు. 24 గంటల ఆరోగ్య కేంద్రంగా ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. పిహెచ్‌సి శిథిలావస్థకు చేరిందని, వర్షం పడితే ఎప్పుడు ఏ గోడ పడుతుందో, ఏ విషసర్పాలు వస్తాయో వైద్య సిబ్బంది భయపడుతూ వైద్యం అందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కొత్త భవనానికి నిధులు మంజూరు చేసినప్పటికీ అది నేటికీ పూర్తి కావడం లేదన్నారు. దీంతో రోగులు వైద్యం కోసం రావడానికి భయపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే వైద్య రంగానికి నిధులు కేటాయించి, పాత భవనానికి మరమ్మతులు చేపట్టి, కొత్త భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, మండల కమిటీ సభ్యులు ఆర్.రాము, జి.వెంకటరమణ, సిహెచ్.కృష్ణ, బి.అప్పారావు, ఆర్.సింహాసనం, ఇ.తాతయ్య, ఆర్.రమణమూర్తి పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు

గిరిజన విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-పాచిపెంట

గిరిజన విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి.శ్రీరామ్, రమేష్, చింత రాజు విమర్శించారు. మండలంలోని బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడు, గొట్టూరు గిరిజన గ్రామాల్లో పాఠశాలలను బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొడ్డపాడు గ్రామంలో పాఠశాల నిర్మాణం చేపట్టాలని ఎన్నిసార్లు ఆందోళన చేసినా పట్టించుకోలేదన్నారు. గొట్టూరు గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. శ్లాబ్ వేయకుండా ప్రహరీ గేటు వేశారని, లోపల చిన్న రేకులతో 39 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. కొండ ప్రాంతాల్లో పాఠశాలలకు ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడి వచ్చి చదువు చెప్పడానికి ప్రయత్నిస్తే, ఇక్కడ ఎటువంటి వసతులు లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షం వచ్చినా తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి భవనాన్ని నిర్మించాలన్నారు. కేరంగి పంచాయతీ అల్లంపాడు, తుమ్మరావల్లి ప్రాంతంలో కొండలుద్దండి, మెలియాకుంచూరు పంచాయతీ ప్రాంతంలో పాఠశాలల భవనాలు లేవని చెప్పారు. ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు, కలెక్టర్, మంత్రి సంధ్యారాణి ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు.


పాఠశాలను పరిశీలిస్తున్న సిఐటియు, గిరిజన సంఘం నాయకులు

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటానికి సిద్ధం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే పోరాటానికి సిద్ధమవుతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి వారు మాట్లాడారు. పిఆర్‌సి కమిటీ కోసం కార్మికులు, ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈలోగా ఐఆర్ ప్రకటించి కార్మికుల వేతనాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పథకాలన్నీ కార్మికులకు అందిస్తామని హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేయాలని కోరారు. నెల్లూరు, ఏలూరులో పని ప్రయివేటీకరణ చేసే విధానాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ తీసుకువస్తున్నారని చెప్పారు. గతంలో 279 జిఒ అమలు చేసినప్పుడు వచ్చే సమస్యలే పునరావృతం చేయాలని చూస్తే కార్మిక వర్గ కోపాన్ని ప్రభుత్వం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు నిర్మల, వరదరాజు, రవి, తిరుపతి, మామిడి శివ, బంగారి రాజేష్, మల్లేశ్వరరావు, శంకరరావు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సిఐటియు, ఫెడరేషన్ నాయకులు, కార్మికులు

10న రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహాన్ని పునర్నిర్మించాలని ఈ నెల పదో తేదీన రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు కెవిపిఎస్ నాయకులు ఎన్.సింహాచలం తెలిపారు. ఈ మేరకు బుధవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించారని తెలిపారు. రహదారి విస్తరణ చేపట్టి దాదాపుగా రెండేళ్లు గడిచినా అధికారుల అసమర్థత వల్ల ఇంతవరకు విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయలేదని చెప్పారు. అనేకసార్లు నిరసన చేపట్టినా, వినతులు ఇచ్చినా ప్రయోజనం లేదన్నారు. దీంతో రిలే నిరాహార దీక్షకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వి.ఇందిర, ఎన్.ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

వైసిపి ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద బుధవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచితంగా అందించాల్సిన వైద్యవిద్యను టిడిపి కూటమి ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని విమర్శించారు. అందుకే ప్రజలకు అండగా ఉండేందుకు కోటి సంతకాలు సేకరించి, గవర్నర్‌కు అందజేస్తామన్నారు. వైసిపి చేపట్టే ఉద్యమానికి ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు నాయుడు, జిల్లా కార్యదర్శి పోల సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, అనుబంధ విభాగాల రాష్ట్ర నాయకులు ఎన్.రామకృష్ణ, ఆర్‌వి, బి.శంకర్రావు, సర్పంచులు ఎం.ధనుంజయ్, బొన్నాడ తిరుపతిరావు, అల్లు తిరుపతి నాయుడు, కురమాల శ్రీనివాసరావు, బి.ముకుందర పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం కుదమ గ్రామనికి చెందిన మాజీ మండల కన్వీనర్ పల్లా రాంబాబు సోదరుడు కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.